క్లుప్తంగా

ప్రభుత్వ పాఠశాలకు ప్యూరిఫైడ్ వాటర్ సరఫరా



పాఠశాలలో ప్యూరిఫైడ్ వాటర్ పంపిణీని ప్రారంభిస్తున్న దాత ఎలుక కర్ణాకర్

నాగారం : మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలకు గ్రామానికి చెందిన ఎలుక కర్ణాకర్ తన తండ్రి సత్తయ్య జ్ఞాపకార్థం ప్యూరిఫైడ్ వాటర్‌ను అందజేసే కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పాఠశాలకు 2023–24 విద్యా సంవత్సరం వరకు విద్యార్థులు తాగేందుకు ప్రతి రోజు మినరల్ వాటర్‌ను అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్మన్ చిప్పపల్లి మల్లేష్, ప్రధానోపాధ్యాయుడు వర్దెల్లి మల్లయ్య, ఉపాధ్యాయులు వెంకటమల్లు, వీరేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలి

నాగారం : మామిడిపల్లి గ్రామంలో ప్రభుత్వం పేదలకు ఇళ్ల నిర్మాణం కోసం కొనుగోలు చేసిన భూమిని పంపిణీ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కడియం కుమార్ డిమాండ్ చేశారు. శనివారం మామిడిపల్లి గ్రామంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. పేదల కోసం ఇళ్ల స్థలాలు కొనుగోలు చేసి ఏళ్లు గడుస్తున్నా నేటికీ పంపిణీ చేయకపోవడం విచారకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేసి, డబుల్‌బెడ్ రూం ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పద్మ, మొల్కపురి రాము, గ్రామస్తులు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థికసాయం చేస్తున్న మృతుడి స్నేహితులు

ఆత్మకూర్(ఎస్) : ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన స్నేహితుడి కుటుంబానికి పూర్వ విద్యార్థులు అండగా నిలిచారు. మండల కేంద్రానికి చెందిన కసగాని శ్రీను అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతిచెందాడు. దీంతో 1997 –1998 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులంతా కలిసి రూ.53వేల ఆర్థికసాయాన్ని శనివారం మృతుడి కుటుంబ సభ్యులకు అందించారు. గతంలోనూ శ్రీను అనారోగ్యంతో బాధపడుతుండగా రూ.53వేల సహకారం అందించారు. కార్యక్రమంలో సందీప్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, చౌదర్‌రెడ్డి, ములకలపల్లి రవి, ఏడుకొండలు,రాజయ్య, భార్గవ్‌రెడ్డి, నగేష్, మధు, శ్రీను, వీరేష్, విక్రమ్‌రెడ్డి, వెంకన్న, బత్తుల ఉపేందర్, మల్లయ్య, బుచ్చిబాబు పాల్గొన్నారు.

సీపీఎం సీనియర్ నాయకురాలికి నివాళి

అర్వపల్లి : సీపీఎం సీనియర్ నాయకురాలు శిగ పిచ్చమ్మ ఆశయ సాధనకోసం కృషి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు కోరారు. శనివారం జాజిరెడ్డిగూడెంలో పిచ్చమ్మ సంతాప సమావేశంలో ఆయన మాట్లాడారు. బడుగు బలహీన వర్గాల కోసం ఆమె పోరాటం చేశారని చెప్పారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బుర్ర శ్రీనివాస్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాంబాబు, మండల కమిటీ సభ్యులు వజ్జె సైదులు, శిగ వెంకన్న, వినయ్, శేఖర్ పాల్గొన్నారు.

మృతుడికి నివాళి

తిరుమలగిరి : తిరుమలగిరి మున్సిపాలిటీలో పని చేస్తున్న ఓస వెంకన్న ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో శనివారం వెంకన్న చిత్రపటానికి మున్సిపల్ చైర్‌పర్సన్ పోతరాజు రజనిరాజశేఖర్ నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్, బిల్ కలెక్టర్ ఉమేష్, మహేష్, పరశురామ్, నాయకులు, తదితరులు ఉన్నారు.

రైతుబీమా దరఖాస్తుల స్వీకరణ

తిరుమలగిరి : కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకం వచ్చిన వారు రైతుబీమా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు కోరారు. శనివారం దరఖాస్తులను స్వీకరించి మాట్లాడారు. ఈ నెల 30వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. 2023 జూన్ 18 వరకు ధరణిలో డిజిటల్ సంతకం పాస్ పుస్తకాలు అయిన వారు మాత్రమే బీమాకు అర్హులని తెలిపారు. రైతు బీమా దరఖాస్తు చేసుకునే వారు క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.డ



తిరుమలగిరిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న వ్యవసాయ శాఖ అధికారి వెంకటేశ్వర్లు

గోదావరి జలాల కోసం ఎదురుచూపు

- వానాకాలం సీజన్‌కు విడుదల కాని షెడ్యూల్
- నీళ్లు ఎప్పుడిస్తారో తెలియక రైతుల సందిగ్ధం
- జాజిరెడ్డిగూడెం మండలంలో 25 వేల ఎకరాల్లో ఆయకట్టు

అర్వపల్లి : ప్రస్తుత వానాకాలం సీజన్‌కుగాను గోదావరి జలాల విడుదలపై ఇంతవరకు నీటి పారుదల శాఖ అధికారులు షెడ్యూల్ విడుదల చేయకపోవడంతో నీళ్లు ఎప్పుడిస్తారోనని రైతులు ఎదురుచూస్తున్నారు. అయితే ప్రతి సీజన్‌కు ఇప్పటికే నీటి విడుదలపై షెడ్యూల్ విడుదల అయ్యేది. కానీ ఈసారి ఇంతవరకు భారీ వర్షాలు పడకపోవడం కారణంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నిండకపోవడంతో నీటి విడుదల షెడ్యూల్ విడుదల కాలేదు. అయితే ఇటీవల సీఎం కేసీఆర్ ఉన్నత స్థాయిలో సమావేశం నిర్వహించి కాళేశ్వరం ఎత్తిపోతల ద్వారా నీటిని శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి నింపాలని ఆదేశించారు. దీంతో అధికారులు ఎత్తిపోతల ద్వారా ప్రాజెక్టును నింపుతున్నారు. ఈ ప్రాజెక్టు నిండాకే నీటి విడుదల షెడ్యూల్ వచ్చే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఇంతవరకు పెద్దవర్షాలు పడకపోవడంతో రైతులు గోదావరి జలాల కోసం ఎదురుచూస్తున్నారు.



నీళ్లు నిలిచిపోయిన 71డీబీఎం కాలువ

జాజిరెడ్డిగూడెం మండలంలో ఇలా..

జాజిరెడ్డిగూడెం మండలంలో ఈ వానాకాలం సీజన్ నందు సుమారు 25 వేల ఎకరాల్లో పంట సాగవుతుందని వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు. ఎస్సారెస్పీ రెండవ దశ కింద మండలంలో 16 వేల ఆయకట్టు సాగుకానుంది. ఎక్కువ మంది రైతులు గోదావరి జలాలపై ఆధారపడే పంటలు సాగుచేస్తున్నారు. అయితే నీటి విడుదలపై షెడ్యూల్ రాక మండల రైతులు అయోమయంలో పడ్డారు. నీళ్లు ఎప్పుడిస్తారో.. ఈ సారి ఎంత పంట సాగుచేసుకోవాలనే విషయమై ఇంతవరకు నిర్ణయించుకు కోలేకపోతున్నారు. కాగా కొందరు రైతులు మాత్రం పొలాలు దున్ని పెట్టుకుంటున్నారు. నార్లు పోసే సమయం దాటుతున్నందున నీటి విడుదల షెడ్యూల్‌ను ప్రకటించాలని కోరుతున్నారు.

నీటి విడుదల షెడ్యూల్ ప్రకటించాలి



“నార్లు పోసుకునే సమయం దాటిపోతుంది. ఎంతపొలం సాగుచేసుకోవాలో అర్థం కావడంలేదు. అధికారులు గోదావరి జలాల షెడ్యూల్‌ను వెంటనే ప్రకటించాలి. షెడ్యూల్ రాక రైతులమంతా అయోమయంలో ఉన్నాం.

– సుంకరి వెంకన్న, రైతు, సీతారాంపురం

షెడ్యూల్ విడుదలవుతుంది



“కాళేశ్వరం ఎత్తిపోతల ద్వారా శ్రీరాంసాగర్ ప్రాజెక్టును నింపే ప్రక్రియ జరుగుతుంది. ప్రాజెక్టు నిండాక నీటి విడుదల షెడ్యూల్ విడుదల కానుంది. ఈ ప్రాంతానికి వానాకాలం సీజన్‌కు తప్పనిసరిగా కాళేశ్వరం జలాలు వస్తాయి. వారం పది రోజుల్లో షెడ్యూల్ వచ్చే అవకాశం ఉంది. రైతులకు కాళేశ్వరం జలాలు అందిస్తాం.

– ఎం.సత్యనారాయణ, బయ్యన్నవాగు, డీఈఈ

ప్రతి ఇంటికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు



తుంగతుర్తి : రావులపల్లి ఎక్స్‌రోడ్డు వద్ద ప్రభుత్వ పథకాలపై కళాజాతా నిర్వహిస్తున్న కళాకారులు

తుంగతుర్తి : రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ ఫలాలను ప్రతి ఇంటికీ అందిస్తోందని తెలంగాణ సాంస్కృతిక సారథి జిల్లా కోఆర్డినేటర్ వేముల నరేష్ అన్నారు. శనివారం మండల పరిధిలోని రావులపల్లి ఎక్స్‌రోడ్డు వద్ద ప్రభుత్వ సంక్షేమ పథకాలపై కళాజాతా నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక సారథి బృందం సభ్యులు గంటి భిక్షపతి, వేముల శ్రవణ్, మాగి శంకర్, చిప్పలపెల్లి సుధాకర్, నిర్మల, నెమ్మాది స్రవంతి, సిరిపంగి రాధ, ప్రియదర్శిని, ఇందిర, తదితరులు పాల్గొన్నారు.

హరితహారం విజయవంతం చేయాలి

అర్వపల్లి : గ్రామగ్రామాన నిర్వహించే తెలంగాణకు హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుల జిల్లా టీం లీడర్ మేడిపల్లి వేణు కోరారు. సీతారాంపురం గ్రామంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు, హరితహారం, సీజనల్ వ్యాధులపై ఆటపాటల ద్వారా ప్రజలకు తెలంగాణ సాంస్కృతిక సారథి ఆధ్వర్యంలో శనివారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాకారులు వెన్నెల నాగరాజు, గద్దం ఉదయ్, పాలకుర్తి శ్రీకాంత్, పాక ఉపేందర్, పల్లెల రాము, లక్ష్మణ్, మంజుల, నాగలక్ష్మి, శిరీష, ప్రియాంక, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి సహకరించాలి

అర్వపల్లి : ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి పాఠశాల యాజమాన్య కమిటీలు సహకరించాలని ఎంఈఓ బి.బాలునాయక్ కోరారు. శనివారం తిమ్మాపురం ప్రాథమిక పాఠశాలలో జరిగిన ఎస్‌ఎంసీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతినెలా జరిగే ఎస్‌ఎంసీల సమావేశానికి పిల్లల తల్లిదండ్రులు హాజరై తగు సూచనలు, సలహాలు ఇవ్వాలని సూచించారు. ఈ సమావేశంలో ఎస్‌ఎంసీ చైర్మన్ బూర్గుల రాంబాబు, హెచ్‌ఎం రవీందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సమష్టిగా పనిచేస్తే సమస్యలు పరిష్కారం



ఆత్మకూర్ (ఎస్) : సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీవైస్ చైర్మన్ వెంకటనారాయణగౌడ్



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ గుడ్ల ఉపేంద్ర



నూతనకల్ : మాట్లాడుతున్న ఎంపీపీ భూరెడ్డి కళావతిసంజీవరెడ్డి

నూతనకల్ : గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా కృషి చేయాలని ఎంపీపీ భూరెడ్డి కళావతిసంజీవరెడ్డి, జెడ్పీటీసీ కందాల దామోదర్‌రెడ్డి కోరారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా అధికారులు, ప్రజాప్రతినిధులు పనిచేసి సమస్యలు పరిష్కరించాలని కోరారు. సమావేశంలో పలు గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు విద్యుత్ సరఫరాలో ట్రాన్స్‌కో అధికారుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం 24గంటల కరెంట్‌ను సరఫరా చేస్తున్నట్లు ప్రకటించినప్పటికీ అధికారులు మాత్రం వ్యవసాయానికి రోజుకు 8గంటలకు మించి ఇవ్వడంలేదన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ, జెడ్పీటీసీలు మాట్లాడుతూ ట్రాన్స్‌కో ఏఈ స్థానికంగా ఉండకపోవడం, విద్యుత్ సరఫరాలో జరుగుతున్న అంతరాయాలను గుర్తించకపోవడం వలనే ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని తెలిపారు. ఇప్పటికైనా రైతులకు నిరంతరం విద్యుత్ సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కనకటి వెంకన్న, తహసీల్దార్ ఎండీ జమీరుద్దీన్, ఎంపీడీఓ ఇందిర, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయాలి

ఆత్మకూరు (ఎస్) : తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేర్చాలని జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ గోపగాని వెంకటనారాయణ గౌడ్ అన్నారు. శనివారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి లబ్ధిదారులకు అందేలా చూడాలన్నారు. ఈ నెల 24న సీఎం కేసీఆర్ సూర్యాపేటలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించేందుకు వస్తున్నందున ప్రతిఒక్కరూ హాజరు కావాలన్నారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు తమ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. పారిశుద్ధ్య కార్మికులు సమ్మెలో ఉన్నందున గ్రామాల్లో చెత్తాచెదారం పేరుకుపోయిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మర్ల స్వర్ణలత చంద్రారెడ్డి, వైస్ ఎంపీపీ నేరెళ్ల వెంకన్న, ఎంపీడీఓ మల్సూర్ నాయక్, పీఏసీఎస్ చైర్మన్ కొణతం సత్యనారాయణరెడ్డి, వైస్ చైర్మన్ బొల్లె జానయ్య, తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

మద్దిరాల : అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి గ్రామాల్లో సమస్యలను పరిష్కరించాలని ఎంపీపీ గుడ్ల ఉపేంద్ర వెంకన్న అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం వర్షాకాలం కారణంగా దోమలు, ఈగల బెడద ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో ఎలాంటి సమస్యలు ఉన్నా పరిష్కరించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు బంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ ఎస్‌ఏ.రజాక్, డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు, ఎంపీడీఓ సరోజ, ఎంపీఓ రాజేష్, ఏఓ వికాస్‌పాటిల్, వైద్యాధికారిణి అశ్రీతరెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు కుందూరు విష్ణువర్ధన్‌రెడ్డి, సర్పంచ్‌లు లొవుడ్యా వెంకన్న, గుండ్ల కొమరయ్య, వెంకన్న, అక్కిరెడ్డి జ్యోతి, లక్ష్మి, ఎంపీటీసీ శిరంశెట్టి వెంకన్న, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



చివ్వెంల : పంచాయతీ కార్మికుల సమ్మెకు మద్దతు తెలుపుతున్న పటేల్ రమేష్ రెడ్డి



తిరుమలగిరిలో సమ్మెలో పాల్గొన్న కార్మికులు

తిరుమలగిరి : ప్రభుత్వం గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు కోరారు. తిరుమలగిరి తహసీల్దార్ కార్యాలయం ఎదుట గ్రామ పంచాయతీ కార్మికులు చేస్తున్న సమ్మెకు శనివారం మద్దతు తెలిపి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కె.రాంబాబు, సహాయ కార్యదర్శి బుర్ర శ్రీనివాస్, కడెం లింగయ్య, సైదులు, రాజు, యాకయ్య, వెంకన్న పాల్గొన్నారు.

చివ్వెంల : మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ఎదుట పంచాయతీ సిబ్బంది చేస్తున్న సమ్మె శనివారం కూడా కొనసాగింది. ఈ సందర్భంగా వారికి టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్‌రెడ్డి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో కె.సాగర్, భానోతు కృష్ణనాయక్, రాంబాబు, శంకర్, శ్రీను, రేణుక, భిక్ష, ఈదయ్య, మోహన్, సురేష్, నాగ, మంగ్యా తదితరులు పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ : గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి మేకనబోయిన సైదమ్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట చేస్తున్న సమ్మెకు సంఘీభావం తెలిపి మాట్లాడారు. అదే విధంగా దళిత బహుజన శ్రామిక యూనియన్ ఆధ్వర్యంలో జిల్లా ఇన్‌చార్జ్ దాసరి శ్రీనివాస్ సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి రణపంగ కృష్ణ, గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ధనియాకుల శ్రీనివాస్, వెంకన్న, నర్సయ్య, మట్టయ్య, రమణయ్య, ముత్తమ్మ, రవి, శ్రీను, పిచ్చయ్య, సైదులు, రవీందర్ పాల్గొన్నారు.

అర్వపల్లి : పది రోజులుగా గ్రామ పంచాయతీ కార్మికులు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయమని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.రాంబాబు, నెమ్మాది వెంకటేశ్వర్లు అన్నారు. అర్వపల్లిలో గ్రామ పంచాయతీ కార్మికుల నిరవధిక సమ్మె శిబిరాన్ని సందర్శించి మాట్లాడారు. గ్రామ పంచాయతీ కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి బుర్ర శ్రీనివాస్, మండల కన్వీనర్ వజ్జె సైదయ్య, కార్మికుల సంఘం మండల అధ్యక్ష, ఉపాధ్యక్షులు జీడి కృష్ణ, కన్నెబోయిన శ్రీశైలం, గుగులోతు నాగులునాయక్, చెరుకు శంకర్, యాకూబ్, ప్రవీణ్, బాషమియా, యుగేందర్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నూతనకల్ : గ్రామ పంచాయతీ పరిధిలో పని చేస్తున్న ప్రతి ఒక్కరికీ ఉద్యోగ భద్రత కల్పించాలని సీపీఐ మండల కార్యదర్శి తొట్ల ప్రభాకర్‌గౌడ్ కోరారు. తమ సమస్యల పరిష్కారం కోసం మండల పరిషత్ కార్యాలయం ఎదుట గత పది రోజులుగా జీపీ కార్మికులు నిర్వహిస్తున్న సమ్మెకు మద్దతు ప్రకటించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఉప్పలయ్య, రవి, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్ (ఎస్) : తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు చేపట్టిన సమ్మెకు శనివారం వికలాంగుల హక్కుల పోరాట సమితి సంఘీభావం తెలిపింది. ఈ సందర్భంగా వీహెచ్‌పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ.జహీర్‌బాబా మాట్లాడారు. పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులను ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కొప్పుల కళింగరెడ్డి, మండల అధ్యక్షుడు బండి మల్లయ్య, నాయకులు జలగందుల కృష్ణమూర్తి, మడిపెల్లి శ్రీనివాస్, దేవులపల్లి వెంకటేశ్వర్లు, నగిరె కృష్ణ, జంపయ్య పాల్గొన్నారు.

ఓపీఎస్ సంకల్ప రథయాత్ర కరపత్రాల ఆవిష్కరణ



తిరుమలగిరిలో కరపత్రం ఆవిష్కరిస్తున్న ఉద్యోగ సంఘాల నాయకులు

తిరుమలగిరి : ఉద్యోగ, ఉపాధ్యాయుల ఓపీఎస్ సంకల్ప రథయాత్ర కరపత్రాలను శనివారం తిరుమలగిరి మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఎస్ మండల శాఖ అధ్యక్షుడు హకీం మాట్లాడారు. ఈ నెల 18న సూర్యాపేటలో తలపెట్టిన పాత పెన్షన్ సాధన సంకల్ప రథయాత్రను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కళ్యాణ్, మండల పంచాయతీ అధికారి మారయ్య, శిల్పిక, జానయ్య, భాస్కర్, సత్తిరెడ్డి, సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, యాదగిరి పాల్గొన్నారు.

ఆత్మకూర్ (ఎస్) : స్థిత ప్రజ్ఞ ఆధ్వర్యంలో జరుగుతున్న పాత పెన్షన్ సాధన సంకల్ప రథయాత్ర ఈ నెల 18న సూర్యాపేట జిల్లాలో ప్రవేశించనున్న నేపథ్యంలో యాత్రను విజయవంతం చేయాలని టీఎస్ సీపీఎస్‌ఈయూ జిల్లా కోశాధికారి గుయ్యాని ప్రసాద్ కోరారు. శనివారం మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సంఘం ఆధ్వర్యంలో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఈశ్వర్ కుమార్, స్వామి, బిందు మాధవి, కోటమ్మ, వెంకటేశ్వరరావు, అనీఫ్, విజయ్, ఆనంద్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టులో మహాసభ

భానుపురి : ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చట్టబద్ధత కోసం ఆగస్టు రెండో వారంలో హైదరాబాద్ నగరంలో మాదిగల విశ్వరూపం మహాసభ నిర్వహిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ సూర్యాపేట జిల్లా ఇన్‌చార్జ్ తురగంటి అంజన్న తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని జగ్జీవన్ రామ్ భవన్‌లో జరిగిన ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. 9 ఏళ్లుగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మాదిగలను నమ్మిస్తూ మోసం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో పుట్టల మల్లేష్, బోడ శ్రీరాములు, ములకలపల్లి రవి, ఏపూరి రాజు, బొడ్డు విజయ్ కుమార్, మల్లేష్, ఆంజనేయులు, మామిడి కరుణాకర్, బొజ్జ వెంకన్న, శ్రీను, గోపి పాల్గొన్నారు.

సేవా దృక్పథం అలవర్చుకోవాలి

అర్వపల్లి : ప్రతి ఒక్కరూ సేవా దృక్పథం అలవర్చుకోవాలని ఎంఈఓ బాలునాయక్ అన్నారు. జాజిరెడ్డిగూడెం మండల కేంద్రానికి చెందిన ఎల్లెంల శ్రీకాంత్, కుమారి మనస్వినిల జ్ఞాపకార్థం అబ్దుల్లాపూర్‌మెట్ సీఐ ఎల్లెంల మన్మోహన్, రిటైర్డు పీఈటీ ఎల్లెంల కొమిరెల్లిలు శనివారం గ్రామంలోని జెడ్పీహెచ్‌ఎస్‌కు క్రీడాసామగ్రి బహూకరించారు. అలాగే ప్రాథమిక పాఠశాలలో పిల్లలకు మధ్యాహ్న భోజనం కోసం 150 ప్లేట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ బి.అంజిరెడ్డి, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలెబోయిన కిరణ్, హెచ్‌ఎంలు కె.తబిత, ఎస్. సుధాకర్, ఎల్లెంల కోమలత, జోషితశ్రీ, ధనఅశ్విత్, ఉపాధ్యాయులు పగిళ్ల సైదులు, ఎన్.మంజుల, కె.వెంకట్‌రెడ్డి, సోమయ్య, సుగుణ, ఇందిర, మధుసూదన్, వెంకటేశ్వర్లు, యాదగిరి, లింగస్వామి, సంపత్ పాల్గొన్నారు.

విద్యాశాఖ అధికారిపై చర్యలు తీసుకోవాలి



నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

సూర్యాపేటటౌన్ : ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇష్టారీతిన పాఠ్యపుస్తకాలు విక్రయిస్తున్న శ్రీచైతన్య పాఠశాలను సీజ్ చేయాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి ఐదు రోజులు గడుస్తున్నా నేటికీ సీజ్ చేయని జిల్లా విద్యాశాఖ అధికారి, ఏడీలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలెబోయిన కిరణ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు గోపగాని రవి, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు బానోత్ వినోద్‌లు డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆయా విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు పిడమర్తి భరత్, ప్రవీణ్, సుమన్, శ్రావణ్, సాయి, వినయ్, సాయి, కిరణ్, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

నీరా కేంద్రాలు ఏర్పాటు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కోటయ్య

దురాజ్‌పల్లి : జిల్లాలోని అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో నీరా కేంద్రాలను ఏర్పాటు చేయాలని తెలంగాణ రాష్ట్ర గీత పని వారల సంఘం జిల్లా కార్యదర్శి కొండ కోటయ్య డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు రేగట్టి లింగయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కాలం తీరిన సొసైటీలకు పాత పద్ధతిలోనే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. గీత కార్మికుల కుటుంబాలకు రూ.లక్ష చొప్పున ఇవ్వాలని అన్నారు. ప్రతి గౌడ కుటుంబానికి వృత్తి పరికరాలను ఉచితంగా అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు బొమ్మగాని శ్రీనివాస్, జిల్లా నాయకులు పాలకూరి బాబు, బూర వెంకటేశ్వర్లు, బొడ్డు రామచంద్రు, బండారు లక్ష్మయ్య, పెద్దపోలు విష్ణు, అనంతల జానయ్య, గోపగాని రవి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను చైతన్యం చేయడమే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

దురాజ్‌పల్లి : పాటను పదునైన బాణంగా మలిచి ప్రజలను చైతన్యం చేయడమే కళాకారుల లక్ష్యమని తెలంగాణ ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు కురిమిద్ద శ్రీనివాస్ అన్నారు. శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా ముఖ్యుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రజా సమస్యలపై ప్రజలను చైతన్యపర్చేందుకు ప్రజానాట్యమండలి కృషి చేస్తుందన్నారు. జిల్లా కళాకారుల శిక్షణ తరగతులను ఆగస్టు 25 నుంచి 30 వరకు సూర్యాపేటలో నిర్వహించబోతున్నామని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, సమావేశ అధ్యక్షుడు ఉపేందర్, ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి బాద నర్సయ్య, ప్రజానాట్యమండలి జిల్లా బాధ్యులు పాలకూరి బాబు, జంపాల మల్లయ్య, శ్రీకాంత్, నిర్మల, వంశీ, జిల్లా శ్రీనివాస్ పాల్గొన్నారు.

కేసీ గుప్తా విగ్రహావిష్కరణకు ఏర్పాట్ల పరిశీలన



విగ్రహావిష్కరణ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రామానుజులరెడ్డి

సూర్యాపేట : కేసీ గుప్తా విగ్రహావిష్కరణను విజయవంతం చేయాలని సూర్యాపేట పట్టణ ఆర్యవైశ్య సంఘం పూర్వ అధ్యక్షుడు బ్రహ్మాండ్లపల్లి మురళీధర్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని పాట్టి శ్రీరాములు సెంటర్‌లో ఆదివారం రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డితో ఆవిష్కరించనున్న విగ్రహ ఏర్పాట్లను శనివారం ఆయన మున్సిపల్ కమిషనర్ పి.రామానుజులరెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి బండారు రాజా, ఉపాధ్యక్షుడు గోపారపు రాజు, బచ్చు పురుషోత్తం, కక్కిరేణి చంద్రమోహన్, బెలిదే అశోక్, మున్సిపల్ అధికారులు డీఈ సత్యరావు, ఏఈ వరుణ్, ఎస్‌ఎస్‌ఆర్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

రేపు కంటి వైద్యశిబిరం

భానుపురి : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డు ఉద్యోగుల సంఘం సూర్యాపేట కార్యాలయంలో ఈ నెల 17న వరంగల్‌కు చెందిన శరత్ మ్యాక్సీ విజన్ లేజర్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు దండ శ్యాంసుందర్ రెడ్డి, సుదగాని నాగేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహించే వైద్యశిబిరానికి పెన్షనర్లు తమ హెల్త్‌కార్డులు తీసుకొని హాజరు కావాలని కోరారు.

సంస్మరణ సభను విజయవంతం చేయాలి

భానుపురి : వనమా వెంకటరామయ్య(వీవీ రామయ్య), గుండా వెంకటప్పయ్య సేవాంకిత సంస్మరణ సభను విజయవంతం చేయాలని స్పందన అవయవదాన, శరీర దాన సేవా సంస్థ సభ్యులు శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఆదివారం స్థానిక సుమంగళి ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్న ఈ సంస్మరణ సభకు మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

పెన్‌పహాడ్ : అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నర్సింగ్ వెంకన్నగౌడ్ శనివారం తెలిపారు. పెన్‌పహాడ్ మండల పరిధిలోని దోసపహాడ్ మూసీ నుంచి హుజూర్‌నగర్‌కు చెందిన రెండు ట్రాక్టర్లు అక్రమంగా ఇసుక తరలిస్తుండగా మాచారం శివారులో పట్టుకొని సీజ్ చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నూతనకల్ : దిర్శనపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ ప్రణయ్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని తెలిపారు.

తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేత

చివ్వెంల : మినీ గురుకుల పాఠశాలలో ఉద్యోగుల సమస్యలను శనివారం తహసీల్దార్ రంగారావుకు మినీ గురుకుల ఉద్యోగులు వినతిపత్రం అందజేశారు. పై తమ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 18 నుంచి 21 వరకు రాష్ట్ర వ్యాప్తంగా జరుగనున్న ధర్నాలో పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రతిభ, శ్రీలత, ఉమ పాల్గొన్నారు.

విద్యార్థులకు స్పాట్ అడ్మిషన్లు

తుంగతుర్తి : మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాలలో శనివారం స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగిందని ప్రిన్సిపాల్ శ్యామలత తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఇంటర్మీడియట్ హెచ్‌ఈసీ, సీఈసీ విభాగంగా 35 మందికి స్పాట్ అడ్మిషన్లు తీసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మిక సొసైటీ చైర్మన్‌గా వెంకన్న

పెన్‌పహాడ్ : పెన్‌పహాడ్ గ్రామ గీత కార్మిక సొసైటీ చైర్మన్‌గా గ్రామానికి చెందిన మామిడి వెంకన్నను ఎన్నుకున్నారు. శనివారం గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా మామిడి సైదులు, కార్యదర్శిగా దండెంపల్లి సైదులు, కోశాధికారిగా శెనగాని రాంబాబు, సలహాదారుగా బజార్‌తో పాటు మరికొంత మంది సభ్యులను ఎన్నుకున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

నూతనకల్ : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సర్పంచ్ తీగల కరుణశ్రీగిరిధర్ రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన జన ఆరోగ్య సమితి సమావేశంలో పాల్గొని మాట్లాడారు. వర్షాకాలం ప్రారంభమైనందున ఈగలు, దోమలు వ్యాప్తి చెంది వివిధ రకాల వ్యాధులకు కారణమవుతాయని తెలిపారు. ప్రజలు తమ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

డెంగీ నివారణపై అవగాహన

తుంగతుర్తి : డెంగీ నివారణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని హెల్త్ అసిస్టెంట్ గాజుల సోమన్న అన్నారు. డెంగీ నివారణ మాసోత్సవాల్లో భాగంగా శనివారం మండల కేంద్రంలోని ఆయా గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. మన చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది యాదగిరి, చారి, ఏఎన్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.